పుట్టిన రోజు ఫంక్షన్

● ఈ ఆధునిక యుగంలో ప్రతిదానికీ ఆదరాబాదరాయే. ఎక్కడా ఒక్క క్షణం కుదురుగా కూర్చోవడం ఎవ్వరికీ సాధ్యపడదు. అందులో మా మూర్తికి మరీనూ.

ఆఫీసుకు వచ్చాడు. ఒక్క క్షణం ఆగలేదు. కార్డు తీశాడు. పేరు రాశాడు. చేతిలో పెట్టాడు. మూడు ముక్కల్లో విషయం చెప్పాడు. పరుగుదీశాడు.

ఇంతకీ ఏమిటా అని చూస్తే– అతగాడి ఒక్కగానొక్క పాప మొదటి పుట్టినరోజు.

నాకసలే ఫంక్షన్లంటే గిట్టదు. వీలయినంత మట్టుకు తప్పించుకుంటాను. అందుకే మా ఆవిడ అంటుంది "మీ ఫంక్షన్లకి కూడా వాళ్లు అలాగే ఎగ్గొడ్తారు" అని.

"ఎగ్గొడ్తే ఎగ్గొట్టవీ. ఎందుకు చేస్తున్నామో, దేనికి చేస్తున్నామో ఎవడికీ తెలియదు. ప్రతిదానికీ ఫంక్షనే. అర్థం పర్థం లేకుండా" నా చాదస్తం నాది.

అయినా అది పక్కన పెట్టి ఆలోచించాను. నా ఆలోచనలో తప్పందేమో. ఇలాంటి ఫంక్షన్లు, పండుగలు, పబ్బాలకే కదా మనుషులు కలిసేది. కలవడంతోనే కదా సాంఘిక జీవితం ప్రారంభమయ్యేది.

'అందులోనూ మూర్తి నా క్లోజ్ ఫ్రెండ్. వెళ్ళకపోతే మనసు చిన్నబుచ్చుకుంటాడు. మనకున్న నియమ నిబంధనలకి ఈసారికి తిలోదకాలు ఇచ్చేద్దాంలే' అనుకున్నాను.

ఆ మాటే మా ఆవిడకి చెప్పాను.

"మీరా! ఫంక్షనుకా?" ఆశ్చర్యపోయింది.

"అవును విజయా!"

"అది జరిగే పని కాదు కాని ఇంకో మాట చెప్పండి" అంది వేళాకోళంగా.

ఆవిడ మాటలు అబద్ధం కాదు. కాని ఈసారికి రిలాక్సేషన్!

"మా క్లోజ్ ఫ్రెండ్ విజయా! తప్పదు. ఒక్కోసారి మన పద్ధతి మార్చుకోవాలి."

"చూద్దాం. ఇంకా టైముంది కదా. వచ్చే శుక్రవారం. ఆ రోజుకు మీకేదో పని పడుతుంది. ముఖ్యమైన పనులు మిస్ అవుతానని ఫంక్షన్ మిస్ చేస్తారు"

"అలాంటిదేం కాదు గాని ఈ ఫంక్షన్‌కి మాత్రం తప్పనిసరిగా వెళదాం. వాళ్ళ మొదటి పాప మొదటి పుట్టినరోజు కదా"

"స్లరెండి" అంటూ నవ్వేసిందామె.

* * *

శుక్రవారం.

ఏడుగంటలైపోయింది. ఆరుగంటలకే ఇంట్లో వాళ్ళని రెడీగా వుండమన్నాను. ఫంక్షను చూస్తే ఏడున్నరకి. స్లరే. ఇంకా అరగంట వుంది. అయినా ఇవన్నీ అనుకున్నట్టుగా జరుగుతాయా ఏమిటి?

ఇంతలో ఫోను మ్రోగింది. అట్నుంచి విజయ "మాకు ఎప్పటికి మోక్షం? అందుకే మీతో ఫంక్షన్లు శుద్ధ దండగ" ఒక షార్ట్ డైలాగ్ వేసింది.

"లేదు లేదు. అరగంటలో అక్కడుంటా. మీరు రెడీ అవండి"

"ఇంకా రెడీ ఏమిటి? ఆరుగంటలకే పిల్లలిద్దరూ నా ప్రాణాలు తీసి రెడీ చేశారు. ఇప్పుడు టైము ఏడుంపావు. వాళ్ళు గోల. ఆటుపైన మీ ఇష్టం."

"నేను చెప్పాను కదా. ఓన్లీ అరగంట"

ఫోను పెట్టేసింది.

సరిగ్గా అప్పుడే వచ్చి పడ్డారు ఒకరిద్దరు కస్టమర్స్! అడిగిందే అడుగుతూ, చెప్పిందే చెబుతూ పరస్పరం పాముల్లా ఒకరి తోక మరొకరు తింటూ వాళ్ళని హిప్నటైజ్ చేసి నా దారికి తీసుకురావడానికి అరగంట పట్టింది.

వ్యాపారంలో అది సహజం కదా. ఈ గోలలో పడి ఫంక్షను సంగతే మర్చిపోయాను.

మళ్ళీ ఫోను!

ఈసారి ప్రయోగించిన వాక్యం ప్రయోగించకుండా నాకు నక్షత్రాలు చూపించింది విజయ.

"బిజినెస్ కదా విజయా! క్షమించేసి మీరు ఆటోలో ఇక్కడికి వచ్చేయండి. ఇట్నుంచి ఇటే కదా వెళ్ళాలి. అయినా అనుకున్న టైముకి ఫంక్షనుకి వెళితే అంత బావుండదు" ఏదో చెప్పాలని మరేదో చెప్పినటటున్నాను.

అయినా నా ప్రయోగం ఫలించింది.

విజయ ఆటోలో రావడానికి ఒప్పుకుంది. పిల్లల్ని తీసుకుని పది నిమిషాల్లో ప్రత్యక్షమయింది.

"ఏంటి డాడీ. మీతో ఎప్పుడూ ఇంతే" అంది మా పాప స్వాతి.

మా అబ్బాయి మాట్లాడలేదు. కోపం వస్తే వాడు మాట్లాడడు.

మొత్తానికి నా హీరోహోండా మీద కుటుంబ సమేతంగా మూర్తి కూతురు పుట్టినరోజు మొదటి ఉత్సవానికి బయల్దేరాం.

* * *

అపార్ట్‌మెంట్ టెర్రస్ మీద ఫంక్షన్. బండి గేటు దగ్గర పార్క్ చేసి పైకి వెళ్ళేం.

జనం. హడావుడి. ఒకపక్క ఆర్కెస్ట్రా. మరోపక్క బఫే.

మూర్తి కనిపించాడు.

"బాగానే ఎరేంజ్ చేశావు. టెర్రస్ మీద గాలి అదీ బాగానే వుంది" అని నేనన్నాను. ఆతడు

సమాధానం చెప్పలోగా ఎవరో వచ్చారు. వాళ్ళని పలకరించడానికి అటు వెళ్ళేడు.

ఆ తరువాత మళ్ళీ కలిశేడు.

"మిడ్ సమ్మర్ కదా. పైన పెట్టకపోతే చాలా కష్టం" అని చెబుతుండగా ఎవరో అతడ్ని ఈడ్చు కుపోయారు.

అక్కడ గిఫ్ట్స్ నోట్ చేసుకుంటున్న టేబుల్ దగ్గర నిలుచున్న మూర్తి మిసెస్ సుజాతకి గిఫ్ట్ ఇచ్చేసి బఫే వరుసలో నిల్చున్నాం. ఇంతకీ మూర్తి కూతుర్ని చూడలేదు.

"పాపాయి ఎక్కడ?" ఎవరో అడిగారు.

"పాపాయి కిందన నిద్రపోతోంది" ఎవరో చెప్పారు.

"కింద నిద్రపోతోందా?" ఆశ్చర్యంగా అడిగాను నేను.

"అవునండి. ఇంతవరకు ఈ ఉక్కలో వుంది. ఒకటే ఏడుపు. వచ్చినవాళ్ళందరు పాపని అడిగిన వాళ్లే. చేతులు మారుతుంటే గోల చేస్తోంది. దానికి చిరాగ్గా వుంటే కింద ఫ్లాట్‌లో పడుకోబెట్టేశాం" అన్నారు మూర్తి అత్తగారు.

స్వాతి ఆ పాపాయిని చూడాలని రెండుమూడుసార్లు అడిగింది. విజయ కూడా "అవునండి! పాప వుట్టినరోజయితే పాపని చూడకుండా ఎలా వెళ్తామండీ?" అంది.

"ఏం చేస్తాం? వేసవికాలం గదా. పాప వుండడం లేదు. అందుకనే అలా చేశారు. ఇంకోసారి చూడొచ్చు."

"లేదు. కిందకి వెళ్ళి పాపని చూసి వస్తాం"

"వెళ్ళండి అయితే."

కిందకెళ్ళారు. పాపని ఎవరూ చూపించలేదట. తలుపు గడియ పెట్టేశారు. వెనక్కి వచ్చేశారు.

"ఫరవాలేదు లెండి. పాపని తరువాత చూద్దాం. పదండి భోజనాలు చేద్దాం" అన్నాను. భోజనాలు అయిపోయాయి.

వచ్చిన ప్రతి ఒక్కరు పాప గురించి అడిగినవాళ్ళే. అది సహజం.

మూర్తి, వాళ్ళ అమ్మగారు, అత్తగారు, మూర్తి భార్య, మిగతా బంధువులు ఆప్తులందరూ ఫంక్షను ఏర్పాట్లలో మునిగిపోయారు.

బయల్దేరేముందర నేను మూర్తిని కలిసి "వస్తాం. మరి పాపని చూడడానికి అవలేదు. నేనంటే ఇంతకుముందు చూశాను. విజయ, పిల్లలు చూడలేదు కదా" అన్నాను.

మూర్తి మొహం ఇబ్బందిగా పెట్టి "సారీ బాసు. మా పాపను తీసుకుని ఇంకోసారి మీ ఇంటికి వస్తాం" అన్నాడు.

"తప్పకుండా రండి." నా మాట విన్నాడో లేదో ఎవరో పిలిస్తే అటు పరుగెత్తాడు. ఏం చేస్తాడు? కార్యక్రమం పెట్టుకున్నాక తప్పదు మరి.

ఇంకా అతిథులు వస్తూనే వున్నారు. మూర్తి, అతడి భార్యా ఇద్దరూ ఉద్యోగస్తులు. చాలామందిని పిలిచినట్టున్నారు. ఎక్కడా ఖాళీ లేదు.

ఇంకెందుకు? బయల్దేరేశాం.

ఆ మరుసటి రోజు ఉదయం ఫోను అందిన వెంటనే మూర్తి ఇంటికి పరుగుదీశాను.

ఇంకేముంది?

ఎవరో చెబుతున్నారు– "అందరూ ఫంక్షను హడావుడిలో పడిపోయి పాపని నిద్రపోతుందని వదిలేశారే కాని, ఊయలని ముట్టుకున్న పాపాన పోలేదు. వేసవికాలం. ఉక్క. కొత్త బట్టలు. సంవత్సరం పిల్ల. పదిమంది చేతులు మీద కదిలి కదిలి అలిసిపోయింది. దానికి తోడు నాలుగు రోజులనుంచి ఉన్న జలుబు, ఆయాసం. అదీ మామూలుదే అనుకున్నారు. కాని ఇలా? ఎవరు ఊహించారు?"

దాదాపు మూర్తి పిచ్చివాడయిపోయాడు.

నేలమీద ఒక్క పరువు. పరువుమీద తెల్లటి గుడ్డ. దానిమీద రబ్బరు బొమ్మలా పాప. మట్టిబొమ్మలా పాప.

నాకే కాదు, అక్కడి దృశ్యం కంటబడిన ప్రతి గుండె బరువెక్కిపోయింది.

DANALAKSHMI PAPER MILLS LTD.
SERVALAKSHMI PAPER AND BOARDS
VIJAYALAKSHMI PAPER MILLS

MANUFACTURERS OF QUALITY PAPER

DELUXE CREAM WOVE	COLOUR WOVE	M.G. POSTER
DUPLICATING	COLOUR PRINTING	M.G. POSTER (WAX TISSUE)
MANIFOLD	NEWSPRINT	M.G. POSTER (OTC)
AZURE WOVE	DELUXE NEWSPRINT	M.G. BLUE MATCH
WHITE WOVE	PULP BOARD	M.G. GREY POSTER
WHITE PRINTING	KRAFT	M.G. PINK MANILA
UNBLEACHED	M.G. KRAFT	

ADDRESS:

MILLS: VILAMPATTI-624 219
NILAKOTTAI (TALUK),
DIDIGUL ANNA DISTRICT, **TAMILNADU**
REGD. OFFICE: 10-Z-BARATHI PARK VII CROSS
SAIBABA COLONY, **COIMBATORE-641 011**

PHONES: MILLS: (045436)-3720-NILAKOTTAI
(045436)-6233-VILAMPATTI
-6242- ""
-6243- ""
REGD. OFFICE: 441284, 448030

FAX: MILLS: 045436-3660 REGD.OFFICE: 0422-430077 TELEX: MILLS: 0440-236-LAXMI IN REGD. OFFICE: 855-428-SRVL-IN